# గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి నిధుల జోరు

**అక్టోబర్‌లో రూ.1,961 కోట్ల పెట్టుబడులు**

న్యూఢిల్లీ, నవంబర్ 13: పెట్టుబడులు ఆకట్టుకోవడంలో గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్(ఈటీఎఫ్ఎస్) దూసుకుపోతున్నాయి. గత నెలలోనూ ఏకంగా రూ.1,961 కోట్ల పెట్టుబడులను ఆకర్షించాయి. ప్రస్తుత పండుగ సీజన్‌లో బంగారం ధరలు భారీగా పుంజుకోవడం, అలాగే పెండ్లిళ్ల సీజన్ కూడా కావడంతో గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి భారీగా పెట్టుబడులు వచ్చాయని అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా(ఆంఫీ) తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. వరుస నెలలతో పోలిస్తే 59 శాతం పెరిగాయి. క్రితం ఏడాది ఇదే నెలలో వచ్చిన రూ.841 కోట్లతో పోలిస్తే రెండు రెట్లు పెరిగాయి. దీంతో గోల్డ్ ఫండ్స్‌లోకి వచ్చే పెట్టుబడులు 12 శాతం పెరిగి రూ.39,823 కోట్ల నుంచి రూ.44,545 కోట్లకు చేరుకున్నాయి. అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను ఈ ఏడాది ఇప్పటి వరకు 75 బేసిస్ పాయింట్లు తగ్గించడం, డాలర్ మరింత బలోపేతం కావడం వంటి పరిణామాలతో బంగారం ధరలు రాకెట్ వేగంతో దూసుకుపోయాయని మార్నింగ్‌స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ రీసర్చ్ ఇండియా మేనేజర్ హిమాన్షు శ్రీవాత్సవ తెలిపారు.

- సెప్టెంబర్ నెలలో గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి రూ.1,233 కోట్ల మేర పెట్టుబడులు వచ్చాయి.
- ఆగస్టులో రూ.1,611 కోట్లు, జూలైలో రూ.1,337 కోట్లు, జూన్‌లో రూ.726 కోట్లు, మే నెలలో రూ.827 కోట్ల మేర వచ్చాయి.
- ఏప్రిల్ నెలలో గోల్డ్ ఈటీఎఫ్‌ల నుంచి రూ.396 కోట్ల పెట్టుబడులను తరలించుకుపోయారు.
- గోల్డ్ ఈటీఎఫ్‌లో సభ్యుల సంఖ్య 2 లక్షలు పెరిగి 57.11 లక్షల నుంచి 59.13 లక్షలకు పెరిగారు.

## 77 వేల దిగువకు బంగారం

బంగారం ధరలు మరింత దిగాయి. హైదరాబాద్ 24 క్యారెట్ తులం పుత్తడి ధర రూ.440 తగ్గి రూ.76,850కి దిగొచ్చింది. అలాగే 22 క్యారెట్ ధర రూ.400 తగ్గి రూ.70,450కి దిగొచ్చింది. కిలో వెండి మాత్రం రూ.1,000 పెరిగి రూ.1.01 లక్షలు పలికింది. అటు ఢిల్లీలో బంగారం నాలుగు వారాల కనిష్ఠ స్థాయి రూ.77,750కి పడిపోయింది.




సౌదీ ఎయిర్‌పోర్ట్స్ ఎగ్జిబిషన్-2024 లో ఎయిర్‌పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు అందుకుంటున్న జీఎమ్మార్ హైదరాబాద్ ప్రతినిధులు

## ఐఖ్య 'ఈ5వరల్డ్'

హైదరాబాద్, నవంబర్ 13: నాన్-బ్యాంకింగ్ సేవల సంస్థ ఐకేఎఫ్ ఫైనాన్స్‌కు చెందిన ఐఖ్య ఇన్‌ఫ్రా డెవలపర్స్..హైదరాబాద్‌లో తాజాగా కొత్త ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. 20 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించతల పెట్టిన రిసార్ట్ స్టైల్ లివింగ్ తరహాలో 'ఈ5వరల్డ్' కోసం రూ.100 నుంచి రూ.150 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టబోతున్నట్లు ప్రకటించింది.

# స్టాక్ మార్కెట్లకు ధరాఘాతం

- భారీగా నష్టపోయిన సూచీలు
- సెన్సెక్స్ 984, నిఫ్టీ 324 పాయింట్లు పతనం
- ఎగిసిన రిటైల్ ద్రవ్యోల్బణం ప్రభావం
- బ్యాంకింగ్, ఆటో షేర్లలో అమ్మకాల ఒత్తిడి
- లక్షల కోట్లలో ఆవిరైన మదుపరుల సంపద



ముంబై, నవంబర్ 13: దేశీయ స్టాక్ మార్కెట్లకు ధరాఘాతం తగిలింది. అక్టోబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం గణాంకాలు ఏకంగా 14 నెలల గరిష్ఠాన్ని తాకుతూ 6.21 శాతానికి చేరడంతో బుధవారం సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. ప్రధానంగా బ్యాంకింగ్, ఆటో, క్యాపిటల్ గూడ్స్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి నమోదైంది. ఈ క్రమంలోనే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) సూచీ సెన్సెక్స్ 984.23 పాయింట్లు లేదా 1.25 శాతం క్షీణించి 77,690.95 వద్ద స్థిరపడింది. ఒకానొక దశలో 1,141.88 పాయింట్లు లేదా 1.45 శాతం పడిపోవడం గమనార్హం. దీంతో వరుసగా రెండోరోజూ సూచీ నష్టాలకే పరిమితమైనట్టైంది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ కూడా 324.40 పాయింట్లు లేదా 1.36 శాతం దిగజారి 23,559.05 వద్ద నిలిచింది. ఫలితంగా వరుసగా ఐదోరోజూ సూచీ పతనమైనట్టైంది. కాగా, తరలిపోతున్న విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు సైతం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి.

### రంగాలవారీగా..

ఆర్థిక, ఆటో, రియల్టీ, ఇండస్ట్రియల్స్, క్యాపిటల్ గూడ్స్, సర్వీసెస్, మెటల్, కమోడిటీస్ షేర్లు 3.23 శాతం నుంచి 2.45 శాతం మేర నష్టపోయాయి. సెన్సెక్స్‌లో మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా స్టీల్, అదానీ పోర్ట్స్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఇండస్ఇండ్ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కొటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు తీవ్రంగా క్షీణించాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్‌క్యాప్ సూచీలూ నిరాశపర్చాయి. 2.56 శాతం, 3.08 శాతం చొప్పున నష్టపోయాయి. కీలక ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్, హాంకాంగ్ సూచీలు నష్టపోగా, చైనా మాత్రం లాభపడింది.

### రూ.13 లక్షల కోట్లు మాయం

స్టాక్ మార్కెట్లలో రెండు రోజులుగా చోటు చేసుకున్న నష్టాలు.. మదుపరుల సంపదను పెద్ద ఎత్తునే మింగేశాయి. సెన్సెక్స్ వరుసగా రెండు రోజుల్లో 1,805.20 పాయింట్లు పడిపోయిన నేపథ్యంలో బీఎస్ఈలో నమోదైన సంస్థల మార్కెట్ విలువ రూ.13,07,898.47 కోట్లు హరించుకుపోయింది. దీంతో రూ.4,29,46,189.52 కోట్ల వద్ద స్థిరపడింది.

# స్విగ్గీ ఎంట్రీ అదిరింది..

**తొలిరోజే లక్ష కోట్లు దాటిన మార్కెట్ విలువ**

ముంబై, నవంబర్ 13: ఫుడ్ డెలివరీ యాప్ స్విగ్గీ.. దేశీయ స్టాక్ మార్కెట్లలోకి గ్రాండ్ ఎంట్రీ ఇచ్చింది. ఓవైపు మార్కెట్లు భీకర నష్టాల్లో నడుస్తున్నా.. మదుపరులు మాత్రం ఈ కంపెనీ షేర్లను ఎగబడి కొనేశారు. దీంతో తొలిరోజే షేర్ విలువ దాదాపు 17 శాతం పెరిగింది. బీఎస్ఈలో ఇష్యూ ధర కన్నా 5.64 శాతం ఎగిసి రూ.412 వద్ద, ఎన్ఎస్ఈలో 7.69 శాతం ఎగబాకి రూ.420 వద్ద లిస్టింగైంది. చివరకు బీఎస్ఈలో 16.91 శాతం పుంజుకొని రూ.455.95 వద్ద ముగియగా, ఒకానొక దశలో రూ.465.30ను తాకింది. అలాగే ఎన్ఎస్ఈలో 16.92 శాతం వృద్ధితో రూ.456 వద్ద నిలిచింది. స్విగ్గీ ఇష్యూ ధర రూ.390గా ఉన్నది. ఇక బంపర్ సక్సెస్‌తో కంపెనీ మార్కెట్ విలువ లక్ష కోట్లు దాటి రూ.1,02,062.01 కోట్లకు చేరింది. మరోవైపు ఎంప్లాయీస్ స్టాక్ ఆప్షన్ కింద అర్హులైన ఉద్యోగులకు స్విగ్గీ కేటాయించిన షేర్ల విలువ ఇప్పుడు భారీగా పెరగడంతో వారంతా కోటీశ్వరులైయ్యారు. 500 మంది దగ్గర రూ.2 కోట్ల విలువైన షేర్లున్నట్టు సమాచారం. ఇక స్విగ్గీ విజయం సాధించడంతో దాని ప్రత్యర్థి సంస్థ జొమాటో శుభాకాంక్షలు తెలిపింది. జొమాటో మార్కెట్ విలువ రూ.2,28,463.62 కోట్లుగా ఉన్నది.

## పోకర్ణ 440 కోట్లతో విస్తరణ

హైదరాబాద్, నవంబర్ 13: రాష్ర్టానికి చెందిన ప్రముఖ గ్రానైట్ ఉత్పత్తి సంస్థ పోకర్ణ ఇంజినీర్డ్ స్టోన్ లిమిటెడ్(పీఈఎస్ఎల్)..భారీ పెట్టుబడులు పెట్టడానికి సిద్ధమవుతున్నది. మహబూబ్‌నగర్ జిల్లాలోని మేకగూడ వద్ద ఉన్న ప్లాంట్ సామర్థ్యాన్ని పెంపొందించడంతోపాటు అడ్వాన్స్‌డ్ యూనిట్‌ను నెలకొల్పడానికి రూ.440 కోట్ల మేర పెట్టుబడి పెడుతున్నట్లు బుధవారం ప్రకటించింది.

## 8 కోట్లు దాటిన ఐటీఆర్ ఫైలింగ్

న్యూఢిల్లీ, నవంబర్ 13: దేశవ్యాప్తంగా పన్ను రిటర్ను దాఖలు చేసే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతున్నారు. 2024-25 అసెస్‌మెంట్ ఏడాదికిగాను 8 కోట్ల మంది ఐటీ రిటర్నులు దాఖలు చేశారని ఐటీ వర్గాలు వెల్లడించాయి. వీరిలో 74 శాతం మంది నూతన పన్ను విధానాన్ని ఎంచుకున్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో వచ్చిన ఆదాయంపై 8 కోట్ల మంది వ్యక్తిగతంగా ఐటీఆర్ దాఖలు చేశారని, వీరిలో 5.92 కోట్ల మంది నూతన పన్ను విధానాన్ని ఎంచుకున్నారని చెప్పారు.

## ఇన్విట్స్, రీట్స్‌కు సెబీ మినహాయింపులు

న్యూఢిల్లీ, నవంబర్ 13: నిర్దిష్ట లాక్-ఇన్, కేటాయింపు ఆంక్షల నుంచి ఇన్విట్స్, రీట్స్‌కు బుధవారం మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ మినహాయింపునిచ్చింది. యూనిట్ బేస్డ్ ఎంప్లాయీ బెనిఫిట్ పథకాల కింద ఎంప్లాయీ బెనిఫిట్ ట్రస్ట్‌కు యూనిట్లను జారీ చేసేటప్పుడు ఈ మినహాయింపులు వర్తిస్తాయి. దీంతో ఉద్యోగులకు యూ నిట్ల పంపిణీ, సేకరణ సులభతరం కాగలదని భావిస్తున్నారు. కాగా, కమర్షియల్ రియల్ ఎస్టేట్ ఆప్షన్లలో నిధులను గుమ్మరించడానికి మదుపరులకు రీట్స్ కలిసొస్తాయి. అలాగే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఆస్తుల పోర్ట్‌ఫోలియోల్లో పెట్టుబడుల అవకాశాన్ని ఇన్విట్స్ కల్పిస్తాయి.


